క్లుప్తంగా

కొయ్యే చిట్టిరాజుకు సన్మానం


చిట్టిరాజును సన్మానిస్తున్న దృశ్యం

భీమవరం: ఐపీఎస్‌కు సెలెక్ట్ అయిన కొయ్యే చిట్టి రాజును ఆదివారం బేతని చర్చ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పట్టా దేవరాజ్ మాట్లాడుతూ కొయ్యే చిట్టి రాజు ఐపీఎస్‌కు ఎంపిక అవ్వడం భీమవరం పట్టణానికి గర్వకారణమని ఆయన అన్నారు. పట్టుదలతో కష్టపడి చదివితే ఏదైనా సాధించ వచ్చని ఆయన అన్నారు. అనంతరం ఘనంగా చిట్టి రాజును సత్కరించారు. ఈ కార్యక్రమం లో ఎస్.పుష్పరాజు, టి.జాన్ ప్రకాష్, పి. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

ఉండిలో ఘనంగా వేదపారాయణం


శివాలయంలో వేదపారాయణం చేస్తున్న వేదపండితులు

ఉండి: శ్రావణమాసం చతుర్దశిని పురస్కరించుకుని ఉండి రాజులపేటలోని శివాలయంలో ఆదివారం వేదసభను నిర్వహించారు.అర్చకుడు సన్నిధిరాజు చలపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభను సమాజ శ్రేయస్సు దృష్ట్యా ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ప్రపంచశాంతి కోసం, ప్రకృతి వైపరీత్యాల నుంచి భూమిని కపాడాలని, ప్రజలంతా సుఖసంతోషాలతోను, ఆయురారోగ్యాలతో జీవించాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వేదపారాయణతో పాటు ఉపనిషత్తులు చదవడం ద్వారా ఆ ప్రాంతమంతా సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ వేదసభలో 43 మంది ఘనాపాఠీలు, 32 మంది క్రమపాఠీలు, 22 మంది స్మార్థపండితులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ జయంతి


సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకోడేరు: పాలకోడేరులో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘ అధ్యక్షుడు కారింకి సాయిబాబు, బీసీ నాయకుడు కొండేటి శివకుమార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘ గౌరవ అధ్యక్షుడు అంగర సుబ్బారావు, యిర్రింకి శ్రీనివాసు, తొంటా సాయిబాబు, అత్తిలి వెంకటేశ్వరరావు, కారింకి వెంకట సత్యనారాయణ, యిర్రింకి విజయకుమార్, చిటకన పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: శ్రావణ మాసం మూడో ఆదివారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రతి వారం తరలివచ్చినట్లుగానే వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు వన మల్లికార్జున స్వామికి జలాభిషేకం

మొగల్తూరు: స్థానిక భ్రమరాంబ సమేత వన మల్లికార్జున స్వామికి శ్రావణ మాసంలో వచ్చే 5 సోమవారాలు జలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశా రు. ఇప్పటికే రెండు సోమవారాలు జలాభి షేకం నిర్వహించామని అలాగే ఈ వారం కూడా సోమవారం రోజున జలాభిషేకం నిర్వ హించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఉత్తరాదిన నిర్వహించే కావిడి యాత్రల మాదిరిగా వనమల్లికార్జున స్వామికి కావిడిలతో నీటిని తీసుకువచ్చి జలాభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. శ్రీశైలం తర్వాత స్వామి వారి లింగాన్ని తాకి దర్శించుకునే అవకాశం ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత అని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో జలాభిషేకం కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

దిగొస్తున్న చికెన్ ధరలు

- కిలో చికెన్ ధర రూ.155.
- శ్రావణ మాస ఎఫెక్ట్ అంటున్న వ్యాపారులు


కోడి గుడ్లు


కోడి మాంసం

వీరవాసరం: శ్రావణ మాసం ప్రారంభ మైంది. హిందువులు ఈ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. దీంతో ఎక్కువ మంది ఆలయాలకు వెళ్లడంతో పాటు ఇళ్లల్లోనూ ప్రత్యేక పూజలు చేస్తుంటారు. దీనికి తోడు నాగుల చవితి సందర్భంగా ఎక్కువ మంది పుట్టలో పాలు పోస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రావణ మాసం ఎఫెక్ట్ చికెన్ ధరలపై పడింది. ఈ మాసంలో ఎక్కువ మంది నాన్ వెజ్ ముట్టుకోరు. అధిక శాతం మంది ప్రత్యేక పూజలు, ఉపవాసాలు చేస్తూ ఉంటారు. అందుకే చాలా ఇళ్లలో ముక్క ముట్టరు. చికెన్ ధరలు తగ్గడానికి ఇది ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. పౌల్ట్రీలో ఎదుగుతున్న కోళ్లను నిర్ణీత సమయం దాటిన తర్వాత అక్కడ ఉంచరు. అలా ఉంచితే రోజు నష్టం తప్ప, బిజినెస్ పరంగా ఎలాంటి లాభమూ ఉండదని చెబుతున్నారు. అందుకే జనం పెద్దగా మాంసాన్ని కొనుగోలు చేపట్టక పోయినా కూడా కోళ్లను చికెన్ షాపులకు తరలిస్తున్నారు. ఈ ఫలితంగానే ధరలు తగ్గాయంటున్నారు. శ్రావణమాసం మొదట్లోనే ధర ఇలా ఉంటే రాబోయే రోజుల్లో చికెన్ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందంటున్నారు.

మార్కెట్‌లో చికెన్ ధరలు ఇలా

చాలా రోజులపాటు కేజీ చికెన్ ధర రూ.250 నుంచి 200 మార్కు నుంచి తగ్గలేదు. కానీ గడిచిన 10 రోజులుగా చికెన్ ధరలు కిందకు దిగివస్తున్నాయి. వీరవాసరం మార్కెట్లో విత్ స్కిన్ చికెన్ కిలో రూ.150, స్కిన్ లెస్ రూ.175కు అమ్ముతున్నారు.

అదే బాటలో కోడిగుడ్లు

కోడిగుడ్ల ధరలు సైతం శ్రావణమాసం ఎఫెక్ట్‌తో కాస్తంత తగ్గు ముఖం పట్టాయి. మార్కెట్లో 10 రోజుల క్రితం హోల్ సేల్ 100 కోడిగుడ్ల రూ.830 పలికాయి. ప్రస్తుతం హోల్ సెల్ మార్కెట్లో 100 గుడ్ల ధర రూ.500 ఉన్నట్లు కోడిగుడ్ల వ్యాపారులు చెబుతున్నారు.

భీమవరం-భద్రాచలం అల్ట్రా డీలక్స్ సర్వీసు ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం-భద్రాచలం మధ్య క్రొత్త అల్ట్రా డీలక్స్ సర్వీసును ప్రారంభించినట్లు డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి తెలిపారు. భీమవరం డిపో డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో అనేక మంది ప్రయాణికులు భద్రాచలం నూతన సర్వీసు భీమవరం డిపో నుంచి పెట్టమని కోరడంతో ఉదయం 4.30 గంటలకు భీమవరంలో బయలుదేరి కైకలూరు, ఏలూరు, చింతలపూడి, సత్తుపల్లి, కొత్తగూడెం, పాల్వంచ మీదుగా భద్రాచలం చేరుకుంటుందన్నారు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంటలకు అక్కడ నుంచి బయలుదేరి భీమవరం రాత్రి 7:30 గంటలకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు నూతనంగా ఏర్పాటు చేసిన భద్రాచలం సర్వీసును ఆదరించాలని, ఈ సర్వీసుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఇతర వివరాలకు 96660 89036, 98665 81333 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

శ్రీరామ్మూర్తి జీవితం ఆదర్శనీయం


శ్రీరామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భీమవరం: ఉన్నతమైన కమ్యూనిస్టు ఆశయాల కోసం జీవిత చర్మాంకం వరకు వలవల శ్రీరామ్మూర్తి నిలిచారని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ అన్నారు. ఆదివారం ఉదయం పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద ఇటీవల మృతి చెందిన వలవల శ్రీరామ్మూర్తి చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆంజనేయులు, మునుకోలు వైకుంఠం, ఒడుగు వెంకటేశ్వరరావు, రఫాయిల్, మామిడి శెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

ఆదర్శ గ్రామంగా ప్రాతాళ్లమెరక


ప్రాతాళ్లమెరక గ్రామంలో పర్యటిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కాళ్ల: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పనలో కాళ్ల మండలంలోని పాతళ్లమెరక గ్రామం ఆదర్శంగా ఉందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీ నారాయణ అన్నారు. ఆదివారం ప్రాతాళ్లమెరక గ్రామంలో ఆయన పర్యటించచరు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత, మంచినీటి చెరువు, ఆరోగ్య కేంద్రం, సచివాలయం, సమీపంలో శివాలయం సందర్శించి ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడి పలు అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ కంతేటి ఉషా, కంతేటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

యువ చైతన్యానికి స్ఫూర్తి సుభాష్ చంద్రబోస్


నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భీమవరం: సాయుధ పోరాటం ద్వారా స్వాతంత్ర్యం కోసం పోరాడిన సుభాష్ చంద్రబోస్ జీవితం ఆదర్శప్రాయమని అఖిల భారత శోభన్ బాబు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద భారత స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. క్విట్ ఇండియా స్థూప పునః నిర్మాణ కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గాంధీ యొక్క అహింసా వాదం మాత్రమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని బోసు భావనగా ఉండేదన్నారు. బోసు మరణం వివాదాస్పదమైందని, 1945 ఆగస్టు 18లో తైవాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో బోసు మరిణించాడని ప్రకటించినప్పటికి, అతను ప్రమాదం నుంచి బయట పడి అజ్ఞాతంలోకి వెళ్ళాడని పలువురు నమ్ముతారని అన్నారు. ఈ స్మృతి వనానికి ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగరాణిలు అనుమతి ఇవ్వడంతో ముందుకు సాగుతున్నామని, ప్రముఖ పారిశ్రామిక వేత్త గాదిరాజు సుబ్బరాజు రూ 50, వేలు, యువజన నాయకులు పరిపాటి శ్రీనివాస్ రూ 25, వేలు, మాజీ కౌన్సిలర్ ఎండి నౌషాద్ రూ 10 వేలు, కోటమర్తి వీరభద్రరావు రూ 10 వేలు అందించారని, ఇంజనీర్స్ సతీష్ ఈ నిర్మాణం చేపడుతున్నారని, మరో రూ 2 లక్షలు కావాల్సి ఉందని, దాతలు ముందుకు రావాలని కోరారు.కార్యక్రమంలో ఇంజనీర్ కే రాంప్రసాద్, నడింపల్లి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి


రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: భిన్నత్వంలో ఏకత్వాన్ని దెబ్బతీసేదిగా వక్ఫ్ బిల్లు ఉందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎస్‌వీ గోపాలన్ ఆరోపించారు. స్థానిక షాదీఖానాలో ఆదివారం వక్ఫ్ బిల్లుపై రౌండ్ టేబుల్ సమావేశం ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జాబితాకి సంబంధించిన వక్ఫ్ ఆస్తులపై కేంద్రం అజమాయిషీ చేయడాన్ని ఫెడరల్ వ్యవస్థపై జరిగే దాడిగా ఆయన విమర్శించారు. వక్ఫ్ బిల్లు సవరణ అవసరం ఎవరికని, ఎందుకని ఆయన ప్రశ్నించారు. ముస్లిం పెద్దలు ఎండీ మస్తాన్ వలీ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుకు ఉన్న అధికారాన్ని తొలగించి, కలెక్టర్లకు ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆరోపించారు. బిల్లును ముస్లింలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఉపాధ్యాయుడు షాజన్, ఎండీ. జక్కీ, అజ్మల్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా పారిశుద్ధ్య పనులు


దుంపగడపలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: మండలంలోని దుంపగపడ గ్రామంలో పారిశుద్ధ్య పనులు వేగంగా సాగుతున్నాయి. గ్రామంలో వైరల్ ఫీవర్, ఇతర వ్యాధులతో ప్రజలు అల్లాడిపోతుండటంతో ఆరోగ్యశాఖ, పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆదివారం పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలోని అన్ని వీధుల్లోనూ, శివారు ప్రాంతాలైన పల్లెపాలెం, తిమ్మరాజు కాలనీ, బోసు కాలనీలల్లోని అన్ని రోడ్ల వెంబడి, డ్రెయిన్ల వెంబడి బ్లీచింగ్ కలిపిన సున్నం చల్లారు. డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేస్తున్నారు. నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. దోమల నిర్మూలనకు ఎబేట్ మందును పిచికారీ చేయిస్తున్నారు. మంచినీటి సరఫరా మెరుగుపరిచేందుకు బ్లీచింగ్, క్లోరినేషన్ కలిపి, ఆలామ్ ట్రీట్‌మెంట్ ద్వారా నీటిని కుళాయిల ద్వారా సరఫ రాచేస్తున్నారు. ఆరోగ్య శాఖ సిబ్బంది కీళ్ల నొప్పులు, వాపులు, మచ్చలు ఉన్న వ్యక్తులకు ప్రత్యేక మందులు అందజేస్తున్నారు. శానిటేషన్‌లో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు చెప్పారు. జ్వరపీడుతులకు సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా చర్యలను తీసుకుంటున్నట్లు పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యులు రాజశేఖర్, సీహెచ్‌ఓ ప్రసాద్ తెలిపారు.

అపూర్వ కలయిక


కలవపూడి హైస్కూల్లో సమావేశమైన 2001-02 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు

కాళ్ల: సుమారు 23 ఏళ్ల క్రితం ఏడో తరగతి చదువుకున్న విద్యార్థుల కలయికకు కలవపూడి హైస్కూల్ వేదికైంది. 2001-02 సంవత్సరంలో ఏడో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలిశారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు వారి కుటుంబ సమేతంగా సమ్మేళనానికి హాజరుకావడంతో హైస్కూల్ ప్రాంగణం కళకళలాడింది.

భయపెడుతున్న పాములు


పెనుగొండ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న బెంగాలీ కార్మికుడు (ఫైల్)

పెనుగొండ: పాములు వ్యవసాయ కార్మికులను భయపెడుతున్నాయి. వరుస పాముకాటులతో కార్మికులు హడలెత్తిపోతున్నారు. పెనుగొండ మండలంలో ఇటీవల పలువురు బెంగాలీ కార్మికులు పాముకాటుకు గురయ్యారు. ముఖ్యంగా రక్త పింజరి పాములు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో వ్యవసాయ పనులకు వచ్చే కార్మికులను కాటు వేస్తున్నాయి. వరి నాట్లు వేయడానికి పశ్చిమబెంగాల్ నుంచి బెంగాలీ కార్మికులు అధిక సంఖ్యలో ఆచంట నియోజకవర్గానికి తీసుకు వస్తుంటారు. వీరో ఒక్కో బంటాకు 20 నుంచి 30 మంది కార్మికులు వరకూ కలసి వస్తుంటారు. వీరు వరినాట్లు పూర్తి చేసిన అనంతరం వరి చేలవద్దే ఏర్పాటు చేసిన మకాంల్లో విశ్రాంతి తీసుకొంటుంటారు. దీంతో వీరు పాముకాటుకు అధిక సంఖ్యలో గురవుతున్నారు. వడలిలో ఇటీవల ఓ బెంగాలీ కార్మికుడిని పాము కాటు వేయడంతో వైద్యం అందిలోపునే మరణించాడు. అదేవిధంగా దేవలో ఉపాధి హామీ పథకంలో ఉపాధి పనుల్లో భాగంగా పంట కాలువలు బాగు చేస్తుండగా మహిళా కార్మికురాలు పాముకాటుకు గురైంది. దీంతో పాటు సుమారు 20 మంది నుంచి 30 మంది వరకూ పాము కాటుకు గురైనా సకాలంలో వైద్యం చేయించుకోవడంతో బతికారు. వీరితో పాటు పెనుగొండ శివారు చిన్నంవారి పాలెం, వడలి ప్రాంతాల్లో పలువురు రైతులు పాము కాటుకు గురయ్యారు. పాము కాటు గుర్తించిన వారు సకాలంలో వైద్యం తీసుకోవడంతో ఇబ్బందులు లేకుండా బయట పడతున్నారు. ఆలస్యం చేసిన వారు పెనుగొండ, సిద్ధాంతం ఆసుపత్రుల నుంచి తణుకు, ఏలూరు ప్రభుత్వాసుపత్రిల వరకూ వెళ్లాల్సి వస్తుంది. అయితే బెంగాలీ కార్మికులు వారి కుటుంబాలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వారిని పనులకు తీసుకు వచ్చినపుడు బీమా చేయాంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందంటూ సీపీఎం నాయకుడు సూర్నిడి వెంకటేశ్వరరావు సూచించారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

భీమవరం: ఒక అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం మండలం ఎల్‌వీఎన్‌పురానికి చెందిన ఉప్పలపాటి సుబ్బారావు (67) ఈనెల 17వ తేదీన ఏఎస్ఆర్ నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో పనికి వచ్చాడు. అయితే అక్కడ బల్బుకు ఉన్న విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. అతనిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. భార్య ఉప్పలపాటి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై వీర్రాజు తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

కాళ్ల: కోడి పందేల స్థావరంపై దాడిచేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు కాళ్ల ఎస్సై ఎస్. శ్రీనివాసరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొండాడ గ్రామశివారులో కోడిపందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద రూ.2,550 నగదుతో పాటు కోడిపుంజు, కోడికత్తి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు.

పాలకోడేరు ఎస్సై పోస్టు ఖాళీ


పాలకోడేరు పోలీస్ స్టేషన్

పాలకోడేరు: పాలకోడేరు పోలీసుస్టేషన్ ఎస్సై పోస్టు ఖాళీగా ఉంది. ఎన్నికల అనంతరం వివిధ శాఖల్లోని అధికారులు సొంత స్థానాలకు బదిలీ అయి వెళ్లిపోయారు. అలాగే ఇప్పటివరకు ఎస్సై పని చేసిన నాళం శ్రీనివాసరావు కాళ్ల మండలానికి బదిలీ అయ్యారు. అయితే ఖాళీ అయిన ఎస్సై స్థానంలో ఇంతవరకూ ఎవరినీ నియమించలేదు. మండలంలో క్రైమ్ రేటు ఎక్కువగా ఉంటుంది. మోటారు వాహనాల దొంగతనాలు నిరంతరం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్సై పోస్టు ఖాళీగా ఉండడంతో పోలీసులు నిఘా ఉండడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఘనంగా రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన


ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: మండలంలోని చిన సారవ రామాలయం వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ధ్వజ స్తంభాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా ఏర్పాటు చేశారు. బ్రహ్మశ్రీ అనిల్‌కుమార్ ఆచార్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే ముధునూరి ప్రసాదరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధ్వజస్తంభం ఏర్పాటుకు సహకరించిన దాతలు జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ,, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ తదితరులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మొల్లేటి పెద్దిరాజు, కుక్కల ఏసుబాబు, కవురు మహేశ్వరరావు, కడలి రాంబాబు, దొంగ మురళీకృష్ణ, గుబ్బల కోటేశ్వరరావు, చింతపల్లి కనకరాజు, గుత్తుల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులను ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం


క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: విద్య, వైద్య, సామాజిక రంగాలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆ సంస్థ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ప్రశంసించారు. పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామానికి చెందిన గుమ్మాపు నరసింహమూర్తి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామ ఉపసర్పంచ్ పెన్మెత్స రామకృష్ణంరాజు, వి కృష్ణంరాజు, పెన్మెత్స రామరాజులు తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి రూ.10వేలు చెక్కును పంపించారు. ఈ చెక్కును ఆదివారం గ్రామ పెద్దల సమక్షంలో రోగి నరసింహమూర్తికి అందజేశారు.

వినోద పన్నుల విషయంలో ఉదాసీనం


నరసాపురం మున్సిపల్ కార్యాలయం

నరసాపురం: వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో నరసాపురం మునిసిపాలిటీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. కనీస మాత్రంగా కూడా వినోదం, ప్రకటనలకు సంబంధించి పన్నులు వసూలు కావడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే ఏటా వచ్చే నామమాత్రపు ఆదాయం కూడా, ఏళ్ల తరబడి వసూలు కాకుండా, మొండి బకాయిగా మిగిలిపోతుంది. వినోదం పన్ను రూపంలో మునిసిపాలిటీకి ఏడాదికి రూ.4 లక్షలు వసూలు అవుతుంది. ఇక ప్రకటనల పన్ను అయితే రూ.1.23 లక్షలు. మొత్తంగా 5.23 లక్షలు పన్నులు వస్తున్నాయి. ఏడాదికి మునిసిపాలిటీకి ఆస్తి, కుళాయిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు తదితర రూపాల్లో రూ 2.75 కోట్లు ఆదాయం వస్తోంది. ఇందులో వినోదం, ప్రకటనల పన్నుల వాటా అత్యంత నామమాత్రంగా ఉందన్నమాట.

రూ.లక్షల్లో బకాయిలు

వినోదం పన్నులు రూ.10 లక్షలు వరకూ, ప్రకటనల పన్నులు రూ 3 లక్షలు వరకూ బకాయిలున్నాయి. వినోదం పన్నులు విషయంలో కేవలం సినిమా థియేటర్లపైనే ఆధారపడుతున్నారు. కేబుల్ నిర్వాహకుల నుంచి సవ్యంగా పన్నులు వసూలు చేయడంలేదు. సిటీ కేబుల్ నిర్వాహకుల నుంచి లక్షల్లో పన్నులు వచ్చే ఇవకాశం ఉన్నా వారి వద్ద నుంచి పన్నులు వసూలు చేయాలనే నిబంధనలు అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.